క్లుప్తంగా

విదేశాల్లో చదవాలనుకునే వారికి నేడు ఉచిత కన్సల్టేషన్ డే

భాగ్యనగర్‌కాలనీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఉచిత కన్సల్టేషన్ డే చక్కటి వేదిక అని యూనీ ఎక్స్‌పర్ట్స్ కన్సల్టెన్సీ ప్రతినిధి బన్నూరు ఇంతియాజ్ అన్నారు. యూఎస్‌ఏ, యూకే, కెనడా, ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందాలనుకునే వారు జేఎన్‌టీయూ రోడ్డులో తమ కార్యాలయానికి శనివారం రావాలని కోరారు. ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా అడ్మిషన్, వీసా ప్రాసెసింగ్ సేవలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 99123 28645లో సంప్రదించాలని కోరారు.

అభినందనలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన సత్యనారాయణ గౌడ్ శుక్రవారం గొట్టిముక్కల వెంగళరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్‌ను ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు.

ఆలయంలో పూజలు.. కార్మికులకు చీరలు



ఆలయంలో కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న గొట్టిముక్కల వెంగళరావు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశివరామాంజనేయ దేవాలయాన్ని ఇటీవల పునర్ నిర్మించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు శుక్రవారం ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు.

అన్నదానం



అన్నం వడ్డిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మూసాపేట: మూసాపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బాబూరావు పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల సంఘాల ఆధ్వర్యంలో పేదలకు ప్రతినెల అన్నదానం చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, సప్పిడి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం అన్నదాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



భాగ్యనగర్‌కాలనీ: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్చి 28న భాగ్యనగర్ కాలనీ బస్‌స్టాప్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటానికి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ వృద్ధుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'మనూ'లో డిబేట్, పాటల పోటీలు

రాయదుర్గం: మనూలో జీ-20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపన్యాసం (డిబేట్), పాటల పోటీలను నిర్వహించారు. విజేతలను శుక్రవారం ప్రకటించారు. షోయాబుర్ రహమాన్, ఎండీ సోహ్రాబ్ ఆలమ్, ఎం.డీ యూసుఫ్ వరుసగా ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్ భాషలలో ఉపన్యాస పోటీలలో విజేతలుగా కాగా పాటల పోటీలలో మహ్మద్ అరీఫ్ విజేతగా నిలిచారు. ఈ పోటీలను ముస్తాక్ అహ్మద్ పటేల్ పర్యవేక్షించారు. డాక్టర్ ఖైసర్‌మహ్మద్, డాక్టర్ ఫర్హత్‌అలీ, డాక్టర్ ఎండీ.రషీద్ ఫారూఖీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వ్యాసరచనలో విజేతలు వీరే..

ఉర్దూ యూనివర్శిటీలో వ్యాస రచన పోటీలను ఉర్దూ, ఇంగ్లిష్, హిందీ భాషలలో వేర్వేరుగా నిర్వహించారు. అందులో ప్రతి భాషలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. అందులో ఇంగ్లిష్‌లో సహానా షెరీన్, ఫాహద్‌కలీక్, మహ్మద్ యూసుఫ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హిందీ భాషలో బుష్రాఫాతిమా,టి మన్నన్, జియావుల్లా అన్సారీ, ఉర్దూ భాషలో అబ్దుల్ అజీమ్, మహ్మద్ అబ్దుల్లా, మజార్ సుబాని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

సరికొత్త ఆలోచనతో..

పిల్లలు, మహిళలకు ప్రత్యేక పార్కు



చాలా మంది మహిళలు ఎక్కువ మంది వచ్చే పార్కులకు వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారి కోసం ప్రత్యేక పార్కు ఉంటే.. వారి సంతోషానికి అవధులు ఉండవు. అలాంటి పార్కునే బాలాజీనగర్ డివిజన్‌లో నిర్మించారు. కాకపోతే ఇది పిల్లలకు కూడా ప్రత్యేకం. ఈ పార్కుకు మహిళలు, పిల్లల పార్కుగా నామకరణం చేశారు. ఈ పార్కు నిర్మాణం మొదలు నుంచి అందుబాటులోకి వచ్చే వరకు జరిగిన విశేషాలను తెలుసుకుందాం.





మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌లో సుమారు కోటి రూపాయల నిధులతో మహిళల పార్కును నిర్మించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఈ పార్కు అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లలకు మాత్రమే పార్కులోకి ప్రవేశం ఉంటుంది. ఇతరులను లోపలకు వెళ్లకుండా అక్కడి సెక్యూరిటీని నియమించారు. మహిళల కోసం అధునాతమైన ఓపెన్ జిమ్, చిన్నారులకు ఆట పరికరాలు, విశాలమైన వాకింగ్ ట్రాక్, యోగా చేసుకోవటానికి గజిబో, మహిళలు ముచ్చటించుకోవడానికి కుర్చీలతో కూడిన మరో గజిబో, అరుగులు, స్కేటింగ్ కోసం స్థలం, షటిల్ కోర్టులు రెండు, పచ్చని చెట్లతో అలరారుతూ ఉంది. ఇటీవలనే ప్రారంభించిన ఈ పార్కులో మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది ఈ చక్కటి చెట్ల మధ్య సెల్ఫీలు దిగుతూ కనిపిస్తున్నారు. మహిళలకు ప్రత్యేకమైన పార్కును కేటాయించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావులను మహిళలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఎమ్మెల్యే సహకారంతోనే..



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో బాలాజీనగర్‌లో ప్రత్యేకంగా మహిళల కోసమే పార్కును తీర్చిదిద్దాం. ఆయన మహిళల కోసం ఎంతో ఆలోచించి మహిళల కోసం ఓపెన్ జిమ్, యోగ శాల, వాకింగ్ ట్రాక్‌ను పార్కులు ఏర్పాటు చేశారు. మహిళలందరి తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. – కార్పొరేటర్ శిరీష బాబూరావు

అన్ని హంగులతో నిర్మించాం..

సరికొత్త థీమ్‌లతో పార్కులను తీర్చిదిద్దే క్రమంలో బాలాజీనగర్ డివిజన్‌లో అన్ని సౌకర్యాలతో కేవలం మహిళల కోసమే పార్కును తీర్చిదిద్దాం. పార్కులో వివిధ రకాల గేమ్స్‌తో పాటు యోగా, వాకింగ్ ట్రాక్, సరదాగా మాట్లాడుకోవటానికి హాల్స్, చిన్నారులు ఆడుకోవటానికి ఆటవస్తువులు సమకూర్చాం. మహిళలు ఉదయం వేళల్లో జిమ్ చేయటానికి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశాం. విశాలమైన పార్కును నిర్మించాం. అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. సుమారు కోటి రూపాయలతో ఈ పార్కును అన్ని హంగులతో నిర్మించాం. – దీఈ ఆనంద్

ఆలీ తలాబ్ చెరువుకు మహర్దశ



ఆలీ తలాబ్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీ తలాబ్ చెరువు సుందరీకరణలో భాగంగా 1 కోటి 83 లక్షల రూపాయల అంచనావ వ్యయంతో చేపడుతున్న అలుగు నిర్మాణం, చెరువులో కలుషిత, వ్యర్థ జలాలు కలవకుండా మళ్లింపు, పైపులైన్ నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులతో శుక్రవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదే విధంగా చెరువు కట్ట పటిష్టత పనులు, చెరువులో మురుగు కలవకుండా ప్రత్యేక చర్యలు, అలుగు మరమ్మతు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రతన్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, నాయకులు సత్యనారాయణ, రాఘవేందర్‌రెడ్డి, బ్రహ్మయ్య, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, మాధవ్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



అప్సర (ఫైల్)

బాలానగర్: కొత్త బట్టలు కొంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రామిరెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 17వ తేదీన తండ్రి దగ్గర రూ.2100 డబ్బులు తీసుకొని కొత్త బట్టలు కొనుకుంటానని చెప్పి బయటకు వెళ్లిన అప్సర (17) తిరిగి ఇంటికి రాలేదు బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సౌంద్ స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్స్



సౌంద్ కలెక్షన్స్‌ను ప్రారంభిస్తున్న లలితాఆనంద్, చాందిని

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని నెక్సస్ మాల్‌లోని రెండో అంతస్తులో సౌంద్ కలెక్షన్స్‌లో స్ప్రింగ్ సమ్మర్- 2023 కలెక్షన్స్‌ను నూతనంగా ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. శుక్రవారం ఈ స్టోర్‌ను నగర పోలీసుల కమిషనర్ సీవీ ఆనంద్ సతీమణి లలితాఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ ఆర్టిస్ట్ చాందిని, సింగర్ సాహితీ చాగంటి, మోడల్స్ పాల్గొన్నారు. ఈ సంర్భంగా స్టోర్ నిర్వాహకులు ప్రవీణ్‌గుప్తా, జ్యోతిగుప్తా మాట్లాడుతూ.. సంప్రదాయం, ఆధునికత సంపూర్ణ కలయికే సౌంద్ బ్రాండ్ అని అన్నారు. తమ స్టోర్‌లో మహిళలకు కావాల్సిన అన్ని రకాల దుస్తులతో పాటు కుర్తా సెట్‌లు, ట్యూనిక్స్ డ్రెస్‌లు, చీరలు లభిస్తాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం.. భక్తులకు అన్నదానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మార్కెట్ చైర్మన్ ముక్కాల సత్యనారాయణ, అధ్యక్షుడు కోతిమీర్ అశోక్, వైస్ చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్, కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.





కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను సాధిద్దాం



పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ మండల కార్యదర్శి రాజశేఖర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఆయన జీవితాన్ని పేదలకే అంకితం చేశారన్నారు. బలహీనవర్గాల హక్కుల కోసం కొట్లాడిన మహానేతగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి అన్ని వర్గాల ప్రజలకు విముక్తి చేసిన మహానాయకుడు సుందరయ్య అని కొనియాడారు. దక్షిణ భారతదేశంలో సీపీఎం నడిపించిన గొప్ప నాయకుడు అన్నారు. శాసనసభ, లోక్‌సభకు అనేక మార్లు ఎన్నికైన ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజులు, లక్ష్మమ్మ, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో సమస్యలను పరిష్కరించాం

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మొదటి రోజు కేపీహెచ్‌బీ కాలనీలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. కాలనీ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి వివరించారు. అభివృద్ధి పనులన్నీ దాదాపు పూర్తయ్యాయని, కరెంట్ స్తంభాలు మార్పిడి, మ్యాన్‌హోల్స్ కవర్లు మార్పిడి, వీధి లైట్లు వంటి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని వాటిని కూడా త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, పవన్‌కుమార్, రంగమోహన్, తిరుపతిరావు, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి, దినేష్, జాన్, పాపరాయుడు, నర్సింహ, సుశీల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో మరో కొత్త కోర్సు ప్రారంభం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుడుతున్నారు. ఉర్దూ యూనివర్శిటీలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్‌లో కొత్తగా పీహెచ్‌డీ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సులో అడ్మిషన్ల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షను హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఉర్దూ సంస్కృతి, భాషా, సాంస్కృతిక పరిభాష, సామెతలు, ఉర్దూ సాహిత్యంలో సాంస్కృతిక వర్ణన, మిశ్రమ సంస్కృతి, బహుళ సాంస్కృతికత, జాతి వైవిధ్యం, భారతీయ సంస్కృతి, ప్రాంతీయ సంస్కృతి, ఇండో-ఇస్లామిక్ సంస్కృతి, జానపద సంస్కృతి, పట్టణ సంస్కృతి, గిరిజన సంస్కృతి, జానపద కళ, జానపద సాహిత్యం వంటి అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 28. మరిన్ని వివరాల కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

గీతంలో జాతీయ పరిశోధనా సింపోజియం

పటాన్‌చెరుటౌన్: ఆర్కిటెక్చర్‌లో పరిశోధనను పెంపొందించడానికి జూలై 20, 21 తేదీలలో విద్యార్థుల కోసం నేషనల్ రీసెర్చ్ సింపోజియంను హైదరాబాద్‌లోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నిర్వహించనుంది. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహకురాలు ప్రొఫెసర్ కుర్రి స్రవంతి శుక్రవారం తెలిపారు. కళ, వాస్తు శిల్పం ద్వారా నగరాల గుర్తింపు, నిర్మాణ సంస్కృతి, వారసత్వ నిర్వహణ, పర్యావరణ సామర్థ్యం, స్థిరమైన భవిష్యత్, సమకాలీన నిర్మాణ పద్ధతులు, వాస్తు శిల్పంలో వైవిధ్యం వంటి ఇతివృత్తాలతో ఈ సింపోజియం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు, జూన్ 12వ తేదీలోగా పరిశోధనా పత్రాలను సమర్పించాలని, వాటిపై వ్యాఖ్య లేదా ఆమోదాన్ని జూలై 1వ తేదీలోగా తెలియజేస్తామన్నారు. తుది సమర్పణ జూలై 10వ తేదీ అని చెప్పారు. బీఆర్క్, ఎంఆర్క్,, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ సింపోజియంలో పాల్గొనడానికి అర్హులని, ఇందులో పత్ర సమర్పణ చేసేవారికి ఉచిత వసతితో పాటు 3 ఏసీ రైలు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు.

5న క్రికెట్ టోర్నమెంట్

శేరిలింగంపల్లి: పురం విశ్వకాంత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శేరిలింగంపల్లి లేగల క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ఫైనల్ మ్యాచ్ జూన్ 13వ తేదీ నిర్వహిస్తామన్నారు. విజేతకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.25 వేల నగదును అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్స్ 988 5755759, 9247924782లలో సంప్రదించాలన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి వేడుకలకు సర్వం సిద్ధం

నేడు కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ గ్రౌండ్‌లో సభ



వివరాలను వెల్లడిస్తున్న టీడీ జనార్దన్, కాసాని జ్ఞానేశ్వర్, మురళీ మోహన్, నందమూరి రామకృష్ణ

కూకట్‌పల్లి: నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శతజయంతి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శనివారం సాయంత్రం 5 గంటలకు కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ గ్రౌండ్‌లో ఈ సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు టీడీ జనార్దన్ వెల్లడించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా నందమూరి కుటుంబ సభ్యులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని ప్రధాని మోదీని విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం జరగబోయే సభలో ఎన్టీఆర్ జీవిత చరిత్రతో కూడిన పుస్తకావిష్కరణతో పాటు వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, సినీనటుడు మురళీ మోహన్, నందమూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కైత్లాపూర్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో నిర్ణయం

కూకట్‌పల్లి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను శనివారం కైత్లాపూర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 20వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 3గంట నుంచి రాత్రి 10గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

- ఈ సందర్భంగా మూసాపేట నుంచి కేపీహెచ్‌బీ 4వ ఫేజు, హైటెక్ సిటీకి వెళ్లే వాహనాలు మూసాపేట క్రాస్ రోడ్డు, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ మీదుగా దారి మళ్లించారు.
- అదే విధంగా ఐడీఎల్ లేక్ నుంచి మాదాపూర్, హఫీజ్ పేట్‌కు వెళ్లే వాహనాలను ఐడియల్ జంక్షన్, కూకట్‌పల్లి బస్‌స్టాప్, కేపీహెచ్‌బీ రోడ్డు నం.1 మీదుగా జేఎన్‌టీయూ జంక్షన్ వైపు నుంచి మళ్లించనున్నారు.
- హైటెక్ సిటి మీద నుంచి కూకట్‌పల్లి, మూసాపేట వచ్చే వారు కేపీహెచ్‌బీ 4వ ఫేజు లోధా అపార్టుమెంట్ నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నం.1కు మళ్లించారు.
- అదే విధంగా పర్వత్‌నగర్, మాదాపూర్ నుంచి మూసాపేట, కూకట్‌పల్లికు వచ్చే వాహనాలు ఎన్ఐఏ మీదుగా ఎడమవైపు తిప్పుకొని జేఎన్‌టీయూ క్రాస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించనున్నారు.
- పర్వత్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సుమారు 7గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డా.అజయ్ అగర్వాల్‌కు 'భారత్ గౌరవ్ అవార్డు'



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసి డాక్టర్ అజయ్ అగర్వాల్, లండన్ లోని బ్రిటీష్ పార్లమెంట్‌లో వివిధ దేశాల ప్రముఖుల సమక్షంలో లండన్ మేయర్ సునీల్ చోప్రా చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మక 'భారత్ గౌరవ్'అవార్డును అందుకున్నారు. నేషనల్ చాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, వైస్ చైర్మన్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ హెడ్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ అయిన అజయ్ అగర్వాల్‌కు పబ్లిక్ రిలేషన్స్, సోషల్ సర్వీసెస్ రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అజయ్‌అగర్వాల్‌కు సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్, కాఫీ టేబుల్ బుక్‌ను బహూకరించారు. ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నందుకు చాలా గర్వంగా ఉందని, నిబద్ధత ఉంటే ఎంత ఎత్తుకైన ఎదగొచ్చని అజయ్ అగర్వాల్ అన్నారు. ఈ 10వ ఎడిషన్ అవార్డుకు భారతీయ చలనచిత్ర దర్శకుడు మధుర్ భండార్కర్, గాయత్రీ పరివార్ చిన్మయ్ పాండ్యా, మేదాంత గ్రూప్ సీఎండీ డాక్టర్ నరేష్ ట్రెహాన్, జెట్ ఎయిర్ వేస్ అంకిత్ జలన్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఎంపికయ్యారు.

హైటెక్స్‌లో అంతర్జాతీయ ఆభరణాల ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ అంతర్జాతీయ ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే ఇది అతిపెద్ద ఆభరణాల ప్రదర్శన అని జంటనగరాల జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాస్ చరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో దక్షిణ భారతదేశంలోని అన్ని రకాల బంగారు ఆభరణాల మోడల్స్‌ని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో దాదాపు 250 మంది ఎగ్జిబిటర్‌లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. అలాగే బంగారం, డైమండ్, వెండి, రత్నాలు తయారీ ప్రక్రియలో ఉపయోగించే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రపరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.